క్లుప్తంగా

పశువ్యాధులపై అప్రమత్తం


ఉల్లిభద్రలో పశువులకు టీకాలు వేస్తున్న వైద్య సిబ్బంది

గరుగుబిల్లి: పశు వ్యాధుల పట్ల పాడిరైతులంతా అప్రమత్తంగా ఉండాలని పశుసంవర్ధక శాఖ అధికారి సురేష్‌కుమార్ సూచించారు. మండలంలోని ఉల్లిభద్ర గ్రామంలో ఉచిత పశువైద్య శిబిరం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా శిబిరానికి తీసుకువచ్చిన పశువులకు జబ్బవాపు, గాలికుంటు వ్యాధులు సోకకుండా వ్యాక్సిన్లు వేశారు. అలాగే గొర్రెలు, మేకలకు చిటుక, జబ్బవాపు వ్యాధులు రాకుండా టీకాలు వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న మూగజీవులను పశు వైద్యశాలకు తరలించి చికిత్స అందివ్వాలన్నారు.

ప్రమాదకరంగా రక్షణ గోడ


పడిపోయిన రక్షణ గోడ భాగం

జియ్యమ్మవలస రూరల్: మండలంలోని తోటపల్లి పాత వంతెన వద్ద ఎడమ కాలువ రక్షణ గోడ ప్రమాదకరంగా దర్శనమిస్తోంది. గోడ పూర్తిగా మరమ్మతులకు గురికావడంతో రోజు రోజుకూ పెచ్చులూడిపోతున్నాయి. గతంలో ఇదే గోడను ఢీకొని పలువురు వాహనదారులు గాయాలపాలయ్యారని, త్వరితగతిన కొత్త గోడ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

రక్తదానంతో ప్రాణాలు కాపాడవచ్చు


రక్తదానం చేస్తున్న యువత

పాలకొండ రూరల్: వివిధ ఆరోగ్య సమస్యల్లో చిక్కుకున్న బాధితులకు అవసరమైన రక్తం సకాలంలో అందించడం ద్వారా వారి ప్రాణాలు కాపాడవచ్చని స్థానిక ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ జి.నాగభూషణరావు అన్నారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా ఆస్పత్రిలో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించి 33 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అపోహలు వీడి ప్రతి ఒక్కరూ రక్తదానానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రక్తదాతలు ఎం.మురళీకృష్ణ, శిల్లా బ్రహ్మాజీ, రమణమూర్తి, నారాయణమూర్తితో పాటు ఏరియా ఆస్పత్రి ఆర్ఎంఓ కడియం చిరంజీవి, డాక్టర్ జె.రవీంద్రకుమార్, వైద్యులు రవికుమార్, నర్సింగ్, సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు వస్త్రాల పంపిణీ

బలిజిపేట: పెదపెంకి పంచాయతీ మాజీ వార్డు సభ్యుడు పి.ఎండయ్య జ్ఞాపకార్థం వారి కుమారులు, కుటుంబీకులు ఎస్సీ వీధిలో 130మంది పేదలకు వస్త్రాలు శనివారం పంపిణీ చేశారు. ఎండయ్య కుమారులు పి.ప్రసాద్ రాజు, నారాయణరావు, ఆనంద్, కుటుంబీకులు నిరుపేదలకు వాటిని గ్రామ పెద్దలు అప్పలనాయుడు మాస్టారు, ఇ.సంజీవినాయుడు, జి.సంజీవినాయుడు చేతుల మీదుగా వీటిని పంపిణీ చేయించారు.

మధ్యాహ్న భోజనం ▸ నిర్వహణ భారం..

- మంజూరు కాని గత విద్యాసంవత్సరానికి సంబంధించిన జీతాలు, బిల్లులు
- తాజాగా తెరుచుకున్న పాఠశాలలు
- పథకాన్ని ఎలా నిర్వహించాలో తెలియక తలలు పట్టుకుంటున్న నిర్వాహకులు


పాలకొండ జెడ్పీ ఉన్నత పాఠశాలలో వంట చేస్తున్న నిర్వాహకులు(ఫైల్)

పాలకొండ రూరల్:

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యాశాఖకు సంబంధించి ఎటువంటి పురోగతి కనిపించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. గత ప్రభుత్వం చేపట్టిన నాడు - నేడు పనులను ప్రస్తుత ప్రభుత్వం పూర్తి చేయలేకపోయింది. అలాగే పుస్తకాలు, బ్యాగులు, షూ, సాక్సులు కూడా అందించలేక అపప్రథ మూటగట్టుకుంది. ఇవన్నీ పక్కనబెడితే పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం నిర్వహిస్తున్న నిర్వాహకులకు గత విద్యా సంవత్సరానికి సంబంధించిన వేతనాలు మంజూరు చేయలేదు. ఈక్రమంలో తాజాగా పాఠశాలలు తెరుచుకోనున్న నేపథ్యంలో పథక నిర్వహణ భారమేనని వాపోతున్నారు.

అప్పుల పాలయ్యారు..

మధ్యాహ్న భోజన నిర్వహణకు సంబంధించి కూటమి ప్రభుత్వం ఎటువంటి పురోగతి చర్యలు చేపట్టలేదు. ప్రాథమిక, యూపీ పాఠశాలలకు సంబంధించి 2024 చివరి నుంచి తాజా నెల వరకు నిధులు మంజూరు కాకపోవడంతో నిర్వాహకులు అప్పులపాలయ్యారు. వంట సహాయకులకు నెలకు మూడు వేల రూపాయల గౌరవ వేతనం కాగా 2024 డిసెంబర్ నుంచి 2025 ఏప్రిల్ వరకు వెయ్యి రూపాయలు చొప్పున వేసి మిగిలిన డబ్బులు ఇంతవరకు వేయలేదు. ప్రస్తుతం పాఠశాలలు తెరుచుకోవడంతో అప్పులు చేసి పథకం నిర్వహించాల్సి వస్తుందని నిర్వాహకులు వాపోతున్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో నాడు - నేడు పేరిట పాఠశాలల భవనాలతో పాటు వంట గదుల నిర్మాణానికి చర్యలు తీసుకున్నారు. ఇందులో కొన్ని

నియోజకవర్గ పరిధిలోని వివరాలివి..		
మొత్తం ప్రభుత్వ పాఠశాలలు	:	365
బోధన పొందుతున్న విద్యార్థులు	:	21,445
నియోజకవర్గంలో మొత్తం వంట నిర్వాహకుల సంఖ్య	:	811
మధ్యాహ్న భోజన నిర్వాహకులను మార్చిన పాఠశాలలు	:	15

పూర్తవ్వగా.. మరికొన్ని చోట్ల పూర్తి కాలేదు. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం కూడా వాటిని పూర్తి చేయలేదు. దీంతో అరకొర వసతుల మధ్యే పథకం నిర్వహించాలని నిర్వాహకులు వాపోతున్నారు. పైగా గ్యాస్ కనెక్షన్లు ఉన్నా కొన్ని చోట్ల కట్టెల పొయ్యిపైనే వంటలు చేస్తున్నారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో తమకు ఇబ్బందులు తప్పవని నిర్వాహకులు చెబుతున్నారు. ఈ విషయాన్ని డిప్యూటీ డీఈఓ పి.కృష్ణమూర్తి వద్ద 'సాక్షి' ప్రస్తావించగా సమస్యను ఉన్నతాధికారులకు వివరించడం జరిగిందన్నారు. నిధులు మంజూరయ్యాయని, త్వరలోనే అందజేస్తామన్నారు.

ఒత్తిళ్లతో ఉద్వాసన..

ఏళ్ల తర 'బడి' మధ్యాహ్న భోజన పథకం నిర్వహణను నమ్ముకున్న చిరుద్యోగులపై కూటమి ప్రభుత్వంలో ఏర్పడిన నూతన విద్యా కమిటీల నుంచి ఒత్తిళ్లు అధికమయ్యాయి. నియోజకవర్గంలో 15 చోట్ల పాత వారిని కావాలనే తొలగించి, తమకు కావాల్సిన వారిని నియమించుకున్నారు. పాలకొండ మండలం తంపటాపల్లి ప్రభుత్వ పాఠశాలలో దశాబ్దాలుగా వంట పని చేస్తున్న అల్లి లక్ష్మి, మురపాక దేశాలమ్మను ఎటువంటి కారణం లేకుండా విధుల నుంచి తొలగించడమే ఇందుకు నిదర్శనం. ఇదే రీతిన అన్నవరం, తుమరాడ పాఠశాలలో నూతన నిర్వాహకులు విధుల్లో చేరారు. భామిని మండల పరిధిలో 12 పాఠశాలల్లో కమిటీల సూచనల మేరకు పాత వారిని తొలగించారు.

పూర్తి వసతులు లేవు..



పథక నిర్వహణకు సంబంధించి పూర్తి వసతులు లేవు. ఐదు నెలలుగా నిర్వాహకులకు జీతాల్లేవు. గ్యాస్ కనెక్షన్లు అందించారు, పొయ్యిలు ఇవ్వలేదు. దీంతో కొన్ని చోట్ల కట్టెల పొయ్యిలపై వంట చేస్తున్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వంట షెడ్ లేదు. బియ్యం, గుడ్లు మినహా మిగిలిన అన్ని వస్తువులూ నిర్వాహకులే సమకూర్చుకోవాలి. అధికారులు స్పందించి బిల్లులు, జీతాలు చెల్లించాలి.
– టి.శ్రీదేవి, వంట నిర్వహకుల సంఘ ప్రతినిధి, పాలకొండ

జీతాలు, బిల్లులు రాలేదు..



గడిచిన కొద్ది నెలలుగా జీతాలు, పథక నిర్వహణకు సంబంధించిన బిల్లులు మంజూరు కాలేదు. చేతిలో సొమ్ము లేదు. మళ్లీ బడి పిల్లలకు వంటలు చేయాలి. అప్పులు చేసి ముడి సరుకులు కొనుగోలు చేయాలంటే అధిక మొత్తం చెల్లించాలి. బిల్లులు పెంచడంతో పాటు జీతాలు మంజూరు చేయాలి.
– ఎస్.రొయిబారమ్మ, ఎ.బుజ్జమ్మ, వంట నిర్వహకులు, సీతంపేట మండలం

అధికారులకు విన్నవించినా..

ఏళ్ల తరబడి వంట నిర్వాహకులుగా పనిచేశాం. మా పనితీరుపై ఎటువంటి ఫిర్యాదులు లేవు. కేవలం నూతన విద్యా కమిటీల సూచనలతో విధుల నుంచి తొలగించారు. మా సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయింది.



– అల్లి లక్ష్మి, మురపాక దేశాలమ్మ, మాజీ వంట నిర్వహకులు, ఎంపీపీ పాఠశాల, తంపటాపల్లి, పాలకొండ మండలం

పరామర్శ

పాలకొండ: మండలంలోని వెలగవాడ పంచాయతీ రుద్రిపేట గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు నేరడబిల్లి బాబూరావు కుటుంబాన్ని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ శనివారం పరామర్శించారు. బాబూరావు శుక్రవారం రాత్రి గుండెపోటుతో మరణించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ విక్రాంత్ మృతుడి కుమారులు నేరడబిల్లి రమేష్, నేరడబిల్లి ప్రసాద్‌లను పరామర్శించి, ఓదార్చారు. పరామర్శలో ఎమ్మెల్సీతో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులు వెలమల మన్మధరావు, కడగల రమణ, దుప్పాడ పాపినాయుడు, బాసూరు కాంతారావు, కిల్లారి మోహన్, తదితరులున్నారు.

దబరలో మినీ అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటు చేయండి

సీతంపేట: మండలంలోని దబర గ్రామంలో మినీ అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. గ్రామంలో ప్రీ స్కూల్ పిల్లలు 12 మంది వరకు ఉన్నారని, వీరి రేషన్ కోసం కోసంగి అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లాల్సి వస్తోందని వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి దబరలో మినీ అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు

గరుగుబిల్లి: మండల పరిధిలోని తోటపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం సుప్రభాతసేవ, మంగళాశాసనం, శాత్తుమురై, తీర్థఘోష్టి తదితర పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు సర్వదర్శనం కల్పించారు. ఈ క్రమంలో భక్తులు పుట్టుదేవుడిని, స్వామి వారిని దర్శించుకుని తలనీలాలు సమర్పించారు. మధ్యాహ్నం దాతల సహకారంతో భక్తులు అన్నదానం చేశారు.

విత్తనాల పంపిణీలో విఫలం..


సమావేశంలో మాట్లాడుతున్న అప్పలనాయుడు

పాలకొండ: రైతులకు అవసరమయ్యే విత్తనాలు పంపిణీ చేయడంలో ప్రభుత్వం విఫలమైందని రైతు సంఘ జిల్లా అధ్యక్షుడు బుడితి అప్పలనాయుడు అన్నారు. డివిజన్ కేంద్రంలో శనివారం జరిగిన రైతుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రైతులకు ప్రభుత్వం కేవలం 30 శాతం మాత్రమే విత్తనాలు అందించిందని తెలిపారు. జిల్లాకు సుమారుగా ఆరు టన్నుల విత్తనాలు అవసరం ఉండగా ఈ ఊడాది రెండు టన్నులు మాత్రమే అందించారని తెలిపారు. ఇందులోను రైతులకు అవసమయ్యే సంపత్ రకం పూర్తిగా అందుబాటులో లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో రైతులు అధిక ధరలకు ప్రైవేట్ వ్యక్తుల వద్ద ఈ రకం విత్తనాలు కొనుగోలు చేయాల్సి వస్తోందని తెలిపారు. మరోవైపు కౌలు రైతులకు గుర్తింపు కార్డులు జారీ చేయడంలోనూ ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని ఆరోపించారు. సమావేశంలో రైతు సంఘ నాయకులు కిమిడి రామ్మూర్తినాయుడు, బచ్చల పారినాయుడు, మజ్జి సన్యాసినాయుడు, గౌరునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలలో మెరుగైన బోధన

● ప్రిన్సిపాల్ హరగోపాల్


విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న ప్రభుత్వ అధ్యాపకుల బృందం

పాలకొండ రూరల్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అనువజ్ఞులైన అధ్యాపకులు ఉన్నారని, నాణ్యమైన బోధన అందిస్తామని ప్రిన్సిపాల్ హరగోపాల్ అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు ఇటీవల 10వ తరగతిలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థుల ఇళ్లకు వెళ్లి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. కార్పొరేట్ స్థాయి విద్య అందిస్తామని, తల్లిదండ్రులు ఆలోచించి ఆర్థిక భారంతో కూడిన కార్పొరేటు కళాశాలల్లో కాకుండా ప్రభుత్వ కళాశాలలో చేర్పించాలని కోరారు.

అవగాహన తప్పనిసరి

● డాక్టర్ రవికుమార్


రోగులను పరీక్షిస్తున్న వైద్యుడు రవికుమార్

పాలకొండ రూరల్: ప్రస్తుత వర్షాకాల సీజన్‌లో విజృంభించే వ్యాధులపై గ్రామీణ ప్రజలు అవగాహన పెంచుకుని వాటిని సమర్థవంతగా అధిగమించాలని ఎం.సింగుపురం పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్.రవికుమార్ అన్నారు. మండలంలోని బెజ్జి సచివాలయ పరిధిలో శనివారం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యసిబ్బంది పలువురు రోగులను పరీక్షించి అవసరమైన వారికి మందులు అందజేశారు. అనంతరం పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత, దోమల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

యోగాంధ్రలో గ్రామీణులు మమేకం


గరుగుబిల్లి: రావుపల్లిలో యోగాసనాలు వేస్తున్న ఎంపీడీవో పైడితల్లి తదితరులు

భామిని: మండల పరిధిలోని సచివాలయాల్లో శనివారం యోగాంధ్ర సందడి కనిపించింది. నేరడి - బిలో కార్యదర్శి ఎల్.అనసూయ పర్యవేక్షణలో సచివాలయ ఉద్యోగులు గ్రామీణ ప్రజలతో యోగాసనాలు వేయించారు. ఎంపీయూపీ స్కూల్‌లో వేతనదారులకు యోగాసనాల వల్ల కలిగే లాభాలను వివరించారు. భామిని గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలలో పీఆర్ డీఈఈ కుమార్ పర్యవేక్షణలో గిరిజన విద్యార్థులు ఆసనాలు వేశారు. ఘనసర గ్రామీణ వికాస సంఘం ఆధ్వర్యంలోని గ్రామస్తులతో ఆసనాలు వేయించి, వాటి ప్రాముఖ్యతను వివరించారు.

గరుగుబిల్లి: జీవనశైలిలో యోగాను భాగస్వామ్యం చేసుకోవాలని డీఎంహెచ్‌వో ఎస్.భాస్కరరావు కోరారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా మండలంలోని సన్యాసిరాజుపేటలో యోగాసనాల సాధనపై శనివారం అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ యోగా చేయడం అలవాటుగా చేసుకోవాలని, యోగా చేయడం ద్వారా శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యం కలుగుతుందన్నారు. ఈ నెల 21న జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవానికి సిద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం అధికారి టి.జగన్‌మోహన్‌రావు, గరుగుబిల్లి పీహెచ్‌సీ వైద్యులు ఎస్.సంతోష్‌కుమార్, సర్పంచ్ ఎం.సరస్వతి పాల్గొన్నారు.

గరుగుబిల్లి: యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా మండలంలోని రావుపల్లిలో జరిగిన యోగాసనాల సాధనలో ఎంపీడీవో జి.పైడితల్లి పాల్గొని, యోగా ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ బి.మహేష్ తదితరులు పాల్గొనగా, మరుపెంట గ్రామంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ ఉరిటి రామారావు పాల్గొని, యోగా ఆవశ్యకతపై చైతన్యం కల్పించారు.

జియ్యమ్మవలస రూరల్: మండలంలోని బిత్రపాడు గ్రామంలో యోగాంధ్ర కార్యక్రమం శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ జి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

యోగాసనాలతో మానసిక ప్రశాంతత..

వీరఘట్టం: యోగాసనాలతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని వీరఘట్టం మేజరు పంచాయతీ ఈఓ బొత్స కోటేశ్వరరావు అన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక పంచాయతీ కార్యాలయం ఆవరణలో యోగాసనాలు వేశారు. అలాగే చిట్టపులివలస పాఠశాలలో ఉపాధ్యాయుడు సాకేటి రాంబాబు ఆధ్వర్యంలో విద్యార్థులు యోగాసనాలతో ఆకట్టుకున్నారు. ప్రతి రోజూ 30 నిమిషాలు యోగా చేయడం వల్ల శరీరంలో మానసిక రుగ్మతలు తొలుగుతాయని రాంబాబు మాస్టారు సూచించారు.


వీరఘట్టం పంచాయతీ కార్యాలయంలో యోగాసనాలు వేస్తున్న పంచాతీ కార్యదర్శి కోటేశ్వరరావు


వీరఘట్టం: చిట్టపులివలస పాఠశాలలో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు


భామిని: నేరడిలో వేతనదారులతో ఆసనాలు వేయిస్తున్న కార్యదర్శి అనసూయ, సచివాలయ సిబ్బంది


గరుగుబిల్లి: సన్యాసిరాజుపేటలో యోగాసనాలు సాధన చేస్తున్న డీఎంహెచ్‌వో భాస్కరరావు


జియ్యమ్మవలస రూరల్: బిత్రపాడులో యోగా సాధన చేస్తున్న గ్రామస్తులు


వీరఘట్టంలో కురుస్తున్న భారీ వర్షం


భామిని: మండలంలో కురుస్తున్న వర్షం


కొమరాడ: విక్రంపురంలో కురుస్తున్న వర్షం

ఏజెన్సీలో భారీ వర్షం


గుమ్మలక్ష్మీపురం(కురుపాం) కురుపాంలోని త్రినాథస్వామి ఆలయంలోకి చేరిన వరదనీరు


భామిని:

మండల వ్యాప్తంగా శనివారం భారీ వర్షం కురిసింది. దీంతో వాతావరణం చల్లబడింది. కొద్ది రోజులుగా ఎండలతో అవస్థలు పడుతున్న ప్రజలు వర్షానికి సేదదీరారు. ఈ వర్షం ఖరీఫ్ సాగుకు ఎంతో అనులకూలమని రైతులు చెబుతున్నారు.

వీరఘట్టంలో భారీ వర్షం..

మండల వ్యాప్తంగా శనివారం ఉదయం ఎనిమిది నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎండ తీవ్రతతో జనం అల్లాడిపోయారు. సాయంత్రం 5 గంటల తర్వాత వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. ఉరుములు, మెరుపులతో పాటు కుండపోత వర్షం కురిసింది. ఉరుములు, పిడుగులకు భయపడి ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రాలేదు. స్థానిక తెలగవీధిలో పిడుగుపాటుకు యాలాల అనిల్ ఇంటి ముందు ఉన్న డూమ్ విరిగి పడిపోయింది. అలాగే ఇంటిలో ఉన్న విద్యుత్ పరికరాలు పాడయ్యాయి. వీరఘట్టం పంచాయతీలో పలువురు గృహాల్లో సుమారు 150 ఫ్యాన్లు, ఇన్వర్టర్లు, బల్బులు కాలిపోయినట్లు స్థానికులు చెబుతున్నారు.

కొమరాడ/గుమ్మలక్ష్మీపురం(కురుపాం): మండలాల్లో శనివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. కొమరాడ మండలంలోని విక్రంపురం, కురుపాం మండల కేంద్రంలో ఎడతెరిపిలేకుండా కురిసిన వానకు లోతట్టు ప్రాంతాల్లోకి వరదనీరు వచ్చి చేరింది. ముఖ్యంగా కురుపాంలోని త్రినాథస్వామి ఆలయంలోకి ఏకంగా మోకాలి లోతు నీరు చేరుకోవడంతో విగ్రహాలు సైతం నీటిలో మునిగిపోయాయి. వ్యవసాయదారులకు మాత్రం ఈ వర్షం మంచిదని, దుక్కి పనులు చేసి నారుమడులు సిద్ధం చేసుకోవచ్చని పలువురు చెబుతున్నారు.


వీరఘట్టం తెలగవీధిలో యాలాల అనిల్ ఇంటిలో ధ్వంసమైన విద్యుత్ బోర్డు

ఎండీయూ వాహనాలు కొనసాగించాలి



ప్రజలకు రేషన్ కష్టాలు తీర్చే ఎండీయూ వాహనాలను కొనసాగించాలని ఆదివాసీ గిరిజన సంఘం కురుపాం మండల అధ్యక్షుడు ఆరిక గంగారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన జి.శివడ పంచాయతీ కార్యదర్శి సురేష్‌కు శనివారం వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రేషన్ తీసుకునేందుకు డీలర్ షాపుల వద్దకు వెళ్లేందుకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ముఖ్యంగా గిరిజనులు కొండ దిగి రావాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. వారు ఎంతో శ్రమ పడి కిందికి వచ్చిన తర్వాత రేషన్ షాపుల వద్ద పెద్ద క్యూలైన్ ఉంటోందని, దీంతో గంటల తరబడి నిల్చోవాల్సిన దుస్థితి ఉంటోందన్నారు. మళ్లీ రేషన్ సరుకుల బరువు నెత్తిన పెట్టుకుని కొండ ఎక్కాల్సి వస్తోందన్నారు. ఈ సమస్యలను దృష్టిలో ఉంచుకుని, కనీసం గిరిజన ప్రాంతాల్లో అయినా వాహనాలు నడపాలని కోరారు.
–గుమ్మలక్ష్మీపురం(కురుపాం)

15 యూనిట్ల రక్తం సేకరణ ..



ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని సీతంపేట ఏరియా ఆస్పత్రిలో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 15 యూనిట్ల రక్తాన్ని సేకరించినట్లు వైద్యాధికారి బి. శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.
– సీతంపేట